క్లుప్తంగా

మాదక ద్రవ్యాల జోలికెళ్లొద్దు

కోవూరు : యువత మాదక ద్రవ్యాల జోలికి వెళ్లొద్దని, చెడు వ్యసనాలతో బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సెబ్ సూపరింటెండెంట్ రవికుమార్ తెలిపారు. కోవూరు సెబ్ కార్యాలయ పరిధిలో వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలకు గురువారం బహిరంగ వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గంజాయి, మద్యం, పొగ తాగడం తదితర వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు. వేలంలో మూడు వాహనాలను పాటదారులు పాడుకున్నారు. కార్యక్రమంలో సెబ్ సీఐ నరహరి, ఎస్సై శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బైక్ అదుపుతప్పి ఇద్దరికి గాయాలు

వెంకటాచలం : మోటారు బైక్ అదుపుతప్పి పడడంతో ఇద్దరు వ్యక్తులు గాయపడిన ఘటన మండలంలోని సర్వేపల్లి సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై గురువారం జరిగింది. గూడూరు పట్టణానికి చెందిన కిశోర్, మనోహర్ బైక్‌పై కృష్ణపట్నం వెళ్తున్నారు. సర్వేపల్లి సమీపంలో కృష్ణపట్నం పోర్టు రోడ్డుపై లారీ అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి పడింది. ఈ ప్రమాదంలో కిశోర్, మనోహర్‌లకు గాయాలవ్వగా చికిత్స నిమిత్తం జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వెంకటాచలం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇళ్ల నిర్మాణాలపై దృష్టి సారించాలి

బుచ్చిరెడ్డిపాళెం : జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాల పురోగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ నరసింహారావు తెలిపారు. మండలంలోని జొన్నవాడ గ్రామ సచివాలయాన్ని గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతివారం నాలుగు సచివాలయాలను తనిఖీ చేస్తున్నామని, ఇందులో భాగంగానే జొన్నవాడ సచివాలయాన్ని సందర్శించామన్నారు. ముఖ్యంగా గడువులోపు ఇళ్లను నిర్మించే విధంగా సంబంధిత అధికారులు, ఇంజినీర్ అసిస్టెంట్లు నిర్మాణాల పురోగతిపై పర్యవేక్షణ చేయాలన్నారు. సచివాలయ సిబ్బంది తప్పనిసరిగా సమయపాలన పాటిస్తూ విధులకు హాజరుకావాలని పేర్కొన్నారు. సచివాలయంలో ప్రతిరోజు స్పందన కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. అనంతరం పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీపీ శ్రీనివాసులు, పంచాయతీ కార్యదర్శి నారాయణ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

సచివాలయాలపై అవగాహన

పొదలకూరు : గ్రామ సచివాలయ నిర్వహణపై అవగాహన కోసం ట్రెయినీ డిప్యూటీ కలెక్టర్ మహేష్ అల్కాతుర్ పొదలకూరు బిట్-1, 3, 4 సచివాలయాలను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు పంచాయతీ సెక్రటరీ అల్లాభక్షు సచివాలయ రికార్డుల నిర్వహణపై వివరించారు. సిబ్బంది పనితీరు, వలంటీర్ వ్యవస్థ తదితర అంశాలను మహేష్ అడిగి తెలుసుకున్నారు. ఈఓపీఆర్డీ నరసింహారెడ్డి డీసీ వెంట ఉన్నారు.

వీరాంజనేయస్వామికి గ్రామోత్సవం



ముత్తుకూరు : ముత్తుకూరులోని వీరాంజనేయస్వామి ఆలయంలో స్వామివారి జయంతి ఉత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి గ్రామోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. అంతకుముందు ఆంజనేయస్వామి విశేష అలంకారంతో భక్తులకు దర్శనమిచ్చారు. మేళతాళాలు, వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య గ్రామోత్సవం బయలుదేరింది. దారిపొడవునా పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. దివంగత ఈదూరు రామచంద్రారెడ్డి జ్ఞాపకార్థం ఇందిరమ్మ, దువ్వూరు వివేకానందరెడ్డి ఉభయకర్తలుగా వ్యవహరించారు.

వలంటీర్ల సేవలు అభినందనీయం

- ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి

నెల్లూరు రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు అందిస్తున్న వలంటీర్ల సేవలను ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి కొనియాడారు. 28వ డివిజన్లోని రాజరాజేశ్వరి దేవస్థాన కల్యాణ మండపంలో గురువారం నిర్వహించిన వలంటీర్లకు వందనం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నవరత్నాలను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్నారని చెప్పారు. వీటిని ప్రజల్లోకి తీసుకెళ్లే విషయంలో వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తగిన విధంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వలంటీర్లను సత్కరించారు. విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి

ఎల్‌ఆర్‌ఎస్‌లో లక్ష్యాలను సాధించాలి



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం (ఎల్‌ఆర్‌ఎస్) అమలుకు నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని, అప్లికేషన్లను త్వరితగతిన పూర్తి చేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. నగరపాలక సంస్థ కార్యాలయంలోని అబ్దుల్ కలామ్ సమావేశ మందిరంలో పట్టణ ప్రణాళిక విభాగం, వార్డు సచివాలయ ప్రణాళిక కార్యదర్శులతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎల్‌ఆర్‌ఎస్‌పై భూ యజమానులకు అవగాహన కల్పించి, పథకం అమలును వేగవంతం చేయాలని చెప్పారు. పెండింగ్‌లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ నమూనాలు, అప్లికేషన్లను జూన్ చివర్లోపు పూర్తి చేయాలని ఆదేశించారు. జీఓ నంబర్ 10 మేరకు నగరంలో 387 అనధికార లేఅవుట్లను గుర్తించి ఎల్‌ఆర్‌ఎస్ స్కీమ్‌లో నమూనాలను రూపొందించి డీటీసీపీకి పంపామని తెలిపారు. జగనన్నకు చెబుదాం, స్పందన వేదికలో అందే అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి ఎండార్స్‌మెంట్‌ను ఆన్‌లైన్ చేయాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో ఏమైనా సమస్యలుంటే తనను కలవాలని పేర్కొన్నారు. అనుమతుల్లేని కట్టడాల నిర్మాణాన్ని తొలి దశలోనే గుర్తించి అడ్డుకోవాలని ఆదేశించారు. భవన సామగ్రి, శిథిలాలు రోడ్లపై ఉండకూడదని, ఇవి కనిపిస్తే సంబంధిత యజమానులకు నోటీసులను జారీ చేసి అపరాధ రుసుము వసూలు చేయాలని ఆదేశించారు.

ఉన్నత గుణాలను అలవర్చుకోవాలి

నెల్లూరు(బృందావనం): తల్లిదండ్రులు, గురువులు కనిపించే దేవుళ్లు అని.. వీరికి వందనం జీవితంలో భాగం కావాలని కవి, పండితుడు శిరోమణిశర్మ పేర్కొన్నారు. శెట్టిగుంటరోడ్డులోని వీవర్స్ కాలనీలో గల పట్టాభిరామస్వామి దేవస్థానంలో బాలరామాయణం, నామరామాయణం, అన్నమయ్య సంకీర్తనల సప్తాహంలో గురువారం ఆయన ఉపన్యసించారు. బాలలు ఉన్నత చదువులతో పాటు ఉన్నత గుణాలను అలవర్చుకోవాలని కోరారు. కిష్కింధకాండ శ్లోకాలను బాలలతో పలికించారు. శ్రీనివాసులురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



క్రైమ్ కార్నర్

గాయపడిన వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): ఫిట్స్‌తో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందారు. పోలీసుల సమాచారం మేరకు.. రామ్‌జీనగర్‌కు చెందిన రహంతుల్లా (40), అంజూ దంపతులకు ఇద్దరు కుమారులు. స్థానికంగా పాన్ షాపును నిర్వహిస్తున్న రహంతుల్లా మద్యానికి బానిసయ్యారు. ఫిట్స్‌తో రెండేళ్లుగా బాధపడుతూ జీజీహెచ్‌లో చికిత్స చేయించుకుంటున్నారు. ఈ నేపథ్యంలో భగత్‌సింగ్‌కాలనీలోని టిడ్కో ఇళ్లలో నివాసం ఉంటున్న తన పెద్దనాన్న ఖాదర్‌బాషా ఇంటికెళ్లొస్తానని భార్యకు చెప్పిన రహంతుల్లా బుధవారం బయటకొచ్చారు. రాత్రయినా ఇంటికి రాకపోవడంతో భర్తకు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. రాత్రి 11.30 ప్రాంతంలో భర్త బావ మాబాషా ఆమెకు ఫోన్ చేసి.. టిడ్కో ఇళ్ల వద్ద రోడ్డుపై రహంతుల్లా పడి నోటి నుంచి నురుగు వస్తోందని, తల వెనుక భాగంలో రక్తగాయమై ఉందని చెప్పారు. దీంతో అంజూ తన మరిది సుభానీతో కలిసి ఘటన స్థలానికి వెళ్లారు. చికిత్స నిమిత్తం నారాయణ హాస్పిటల్‌కు అక్కడి నుంచి జీజీహెచ్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. ఘటనపై నవాబుపేట పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు. ఎస్సై తిరుపతయ్య హాస్పిటల్‌కు చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.



నకిలీ పత్రాల కేసులో నిందితుడి అరెస్ట్

నెల్లూరు(క్రైమ్): నకిలీ పత్రాలతో రూ.కోట్ల విలువైన స్థలాన్ని ఇతరులకు రిజిస్ట్రేషన్ చేసిన కేసులో నిందితుడ్ని బాలాజీనగర్ పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. ఇన్‌స్పెక్టర్ రాములు నాయక్ సమాచారం మేరకు.. తన భూమికి కొందరు నకిలీ పత్రాలను సృష్టించి ఇతరులకు విక్రయించారంటూ రామ్మూర్తినగర్‌కు చెందిన దేవిరెడ్డి వాయుసుత బాలాజీనగర్ పోలీసులకు ఈ నెల 20న ఫిర్యాదు చేశారు. ఎనిమిది మందిపై కేసు నమోదు చేసి ఇన్‌స్పెక్టర్ దర్యాప్తు చేపట్టారు. నకిలీ పత్రాలను సృష్టించి ఇతరులకు రిజిస్ట్రేషన్ చేసింది శ్రీధర్‌రావేననే అంశం విచారణలో తేలిందని ఇన్‌స్పెక్టర్ తెలిపారు. మిగిలిన వారు స్థలాన్ని కొనుగోలు చేశారే తప్ప నకిలీ పట్టాల గురించి ఏమీ తెలియదని, దీంతో శ్రీధర్‌రావునే అరెస్ట్ చేశామని చెప్పారు.

వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీలతో సమావేశం



నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): నగరంలోని 14వ డివిజన్లో వార్డు ఎడ్యుకేషన్ సెక్రటరీలతో కార్పొరేటర్ ప్రతాప్‌రెడ్డి గురువారం సమావేశమయ్యారు. డివిజన్ పరిధిలో అమ్మ ఒడి, విద్యా, వసతి దీవెనకు అర్హత కలిగిన వారి జాబితాను పరిశీలించారు. అనర్హత జాబితాలో ఉన్న వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. వీరూ అర్హత పొందేలా కృషి చేయాలని కోరారు. అనంతరం పింఛన్‌కు దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన వారితో మాట్లాడారు.

అనధికార మద్యం విక్రయాలపై దాడులు

నెల్లూరు(క్రైమ్): బీవీనగర్‌లోని ఓ బార్ వద్ద అనధికార మద్యం విక్రయాలపై వేదాయపాళెం పోలీసులు గురువారం తెల్లవారుజామున దాడులు చేశారు. నిందితుడ్ని అరెస్ట్ చేసి అతని నుంచి 42 క్వార్టర్ల మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల సమాచారం మేరకు.. బీవీనగర్‌కు చెందిన చంద్రారెడ్డి కూలీ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. సంపాదన కుటుంబపోషణకు సరిపోకపోవడంతో అనధికార మద్యం విక్రయాలపై దృష్టి సారించారు. నగరంలోని వివిధ షాపుల్లో మద్యాన్ని కొనుగోలు చేసి బీవీనగర్‌లోని ఓ బార్ అండ్ రెస్టారెంట్ వద్ద అర్ధరాత్రి వేళ విక్రయించి సొమ్ముచేసుకోసాగారు. దీనిపై వేదాయపాళెం ఇన్‌స్పెక్టర్ రమణకు పక్కా సమాచారం అందింది. ఆయన ఆదేశాల మేరకు ఎస్సై రాజ్‌కుమార్ తన సిబ్బందితో కలిసి దాడులు చేశారు. విక్రేత చంద్రారెడ్డిని అరెస్ట్ చేసి అతని నుంచి రూ.6280 విలువజేసే 42 క్వార్టర్ల మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

నేత్రదానం



జయలక్ష్మి (ఫైల్)

నెల్లూరు(బారకాసు): నవలాకులతోటకు చెందిన జయలక్ష్మి (56) గురువారం మృతి చెందారు. ఈ క్రమంలో కుటుంబసభ్యుల అంగీకారంతో ఆమె నేత్రాలను ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ టెక్నీషియన్ లాలేష్ సేకరించారు. అనంతరం కుటుంబసభ్యులకు సర్టిఫికెట్‌ను అందజేశారు. నేత్రదానం చేయాలనుకునే వారు 99481 64781, 93471 11033 నంబర్లను సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని రైతుబజార్ సబ్‌స్టేషన్ పరిధిలో గల బోడిగాడితోట ఫీడర్‌లో విద్యుత్ లైన్లను ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో పలు ప్రాంతాల్లో సరఫరా శుక్రవారం ఉండదని నెల్లూరు టౌన్ – 2 డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ మధుసూదన్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బోడిగాడితోట, వైకుంఠపురం, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు సరఫరా ఉండదని చెప్పారు.

మహిళపై దాడి

నెల్లూరు(క్రైమ్): మహిళపై ఇద్దరు దాడి చేసిన ఘటనపై దర్గామిట్ట పోలీసులు కేసును గురువారం నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. తోటపల్లిగూడూరుకు చెందిన స్పందనకు బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన సుమచంద్రకు విభేదాలున్నాయి. సుమచంద్రపై స్పందన పరువు నష్టం కేసు వేశారు. కేసును వెనక్కి తీసుకోవాలంటూ కొద్ది రోజులుగా సుమచంద్ర ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఈ నేపథ్యంలో స్పందనపై సుమచంద్ర, రజనీ చంద్ర డీమార్ట్‌లో ఈ నెల 19న దాడి చేసి గాయపర్చారు. ఈ మేరకు పోలీసులకు బాధితురాలు ఫిర్యాదు చేశారు.

బీజేపీలో పలువురికి పదవులు



నెల్లూరు(మినీబైపాస్): బీజేపీ కోస్తాంధ్ర (నెల్లూరు, తిరుపతి, ఒంగోలు, బాపట్ల, గుంటూరు, విజయవాడ, పల్నాడు జిల్లా) జోనల్ ఇన్‌చార్జిగా యశ్వంత్‌సింగ్‌ను నియమించారు. ఈ మేరకు పార్టీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. పలువురికి ఆయన కృతజ్ఞతలను తెలియజేశారు.



- బీజేపీ జిల్లా కార్యదర్శిగా ప్రవీణ్‌కుమార్‌ను నియమించారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్‌కుమార్‌యాదవ్ ఉత్తర్వులను గురువారం జారీ చేశారు. ఆయన్ను పలువురు అభినందించారు.

రోగులకు మెరుగైన వసతులు కల్పించాలి



మాట్లాడుతున్న హరినారాయణన్



హాజరైన అధికారులు

- కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా మౌలిక సదుపాయాలు కల్పించాలని కలెక్టర్ హరినారాయణన్ ఆదేశించారు. ప్రభుత్వాస్పత్రిలో వసతుల మెరుగునకు చేపట్టాల్సిన చర్యలపై వైద్యశాల సూపరింటెండెంట్ సిద్ధానాయక్, మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ మురళీకృష్ణ, ఏపీఎంఐడీసీ ఇంజినీర్లతో తన చాంబర్‌లో గురువారం సమీక్షించిన అనంతరం కలెక్టర్ మాట్లాడారు. వైద్యశాలలో మరమ్మతులకు గురైన లిఫ్ట్, ఏసీలను సత్వరమే బాగు చేయించాలని సూచించారు. వార్షిక నిర్వహణ పనులను చేపట్టాలని, దీనికి అవసరమైన నిధులను మంజూరు చేస్తామని తెలిపారు. విద్యుత్ సరఫరా, ఫ్రీజర్లు, ఫ్యాన్, ఇంటర్నెట్, తదితరాలపై అనుమతి పొంది పనులను చేపట్టాలని సూచించారు.

క్రీడాకారులకు కలెక్టర్ అభినందన

నెల్లూరు(దర్గామిట్ట): పతకాలు సాధించిన జిల్లాకు చెందిన పలువురు క్రీడాకారులకు కలెక్టర్ హరినారాయణన్ గురువారం అభినందించారు. అరుణాచల్ ప్రదేశ్ రాజధాని ఇటానగర్‌లో ఇటీవల నిర్వహించిన జాతీయ స్థాయి కర్లింగ్ పోటీల్లో రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహించిన పలువురు ఉత్తమ ప్రతిభ చూపారు. ఈ క్రమంలో వీరిని కలెక్టర్ అభినందించారు. కర్లింగ్ అసోసియేషన్ సభ్యుడు సుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.



షాదీమంజిల్‌కు అద్దె ఖరారు

నెల్లూరు(బారకాసు): కోటమిట్టలో అధునాతనంగా నిర్మించిన షాదీమంజిల్‌లో శుభకార్యాలు జరుపుకొనేందుకు అద్దెను ఖరారు చేశామని కమిషనర్ వికాస్ మర్మత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి కార్యానికి రూ.10 వేల చొప్పున నగరపాలక సంస్థ కార్యాలయంలో చెల్లించి రసీదును పొందాలని సూచించారు. నిర్వహణ బాధ్యతలను నగరపాలక సంస్థలోని ఇంజినీరింగ్ విభాగ ఆధ్వర్యంలో పర్యవేక్షించనున్నారని చెప్పారు. అద్దెకు తీసుకున్న వారు సదరు భవనానికి ఎలాంటి నష్టం చేయకూడదని, ఒక వేళ అలా జరిగితే పూర్తి బాధ్యతను వారే వహించాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. విద్యుత్‌కు సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన కమర్షియల్ యూనిట్ రేట్ ప్రకారం చెల్లించాల్సి ఉంటుందన్నారు. అద్దెకు తీసుకున్న వారు షాదీమంజిల్ భవనం లోపల, బయట పరిశుభ్రం చేసే బాధ్యత వహించాలని తెలిపారు.

పర్యావరణహిత జీవన శైలిపై ర్యాలీ

నెల్లూరు(బారకాసు): పర్యావరణహిత జీవన శైలిపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గానూ సైకిల్ ర్యాలీని ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి.. గ్రామ, వార్డు సచివాలయాల విభాగాల ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించనున్నామని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని తన చాంబర్‌లో విలేకరులతో గురువారం ఆయన మాట్లాడారు. గాంధీబొమ్మ సెంటర్ నుంచి ఏసీ సుబ్బారెడ్డి క్రీడా మైదానం వరకు ర్యాలీని నిర్వహించనున్నామని చెప్పారు. సైకిల్ ర్యాలీలో పాల్గొని పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.



వలంటీర్లకు సత్కారం

నెల్లూరు(బారకాసు): నగరంలోని 24వ డివిజన్లో వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరిని సత్కరించారు. ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సూచనల మేరకు నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలు సురేష్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, సునీల్, రాఘవేంద్ర, మురళి, భారతి, తదితరులు పాల్గొన్నారు.



కామాక్షితాయి సేవలో ప్రిన్సిపల్ సెక్రటరీ

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో కొలువైన మల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారిని రాష్ట్ర ట్రాన్స్‌పోర్ట్, ఆర్ అండ్ బీ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ పీఎస్ ప్రద్యుమ్న తన కుటుంబసభ్యులతో కలిసి గురువారం రాత్రి దర్శించుకున్నారు. తొలుత వారికి ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతం పలికారు. అనంతరం గణపతి స్వామి, సుబ్రహ్మణ్యం స్వామి, మల్లికార్జున స్వామి, కామాక్షితాయి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈ సందర్భంగా వారిని స్వామివారి శేషవస్త్రాలతో సత్కరించి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు, ఈఓ వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

